సాక్షి హనుమకొండ

గురువారం । 25 । జూలై । 2024



ఆశలు.. అడియాసలేనా..?

ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల బదిలీలపై ఎలాంటి స్పష్టత రావడం లేదు. ట్రాన్స్కో సీఎండీ మారడంతో బదిలీల్లో జాప్యమవుతుందని ఉద్యోగులు భావిస్తున్నారు. - 8లో



పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు

పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి పెంచొద్దని, సహనం పాటిస్తే సత్ఫలితాలు వస్తాయని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు విద్యాధర్ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
28^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డిపోలో ప్రమాదరహిత వారోత్సవాలు



హన్మకొండ: ఆర్టీసీ హనుమకొండ డిపోలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖ అధికారి జి.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఎదురుగా వస్తున్న వాటిని గమనిస్తూ వాహనాన్ని నడపాలన్నారు. పాదచారులను, రోడ్డు పరిస్థితులను గమనించాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు సుశిక్షితులైన వారని, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఈసందర్భంగా ఇప్పటి వరకు ఆక్సిడెంట్లు చేయని డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంవీఐ బి.కిశోర్ బాబు, హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియా సుల్తానా, మెకానికల్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

మెరుగైన శిక్షణ ఇవ్వాలి



వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందేలా, కోచ్‌ల శిక్షణ తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంచాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) డైరెక్టర్ కొర్ర లక్ష్మి హనుమకొండ డీవైఎస్ఓ అశోక్‌కుమార్‌కు సూచించారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా బుధవారం హనుమకొండకు వచ్చిన సాట్ డైరెక్టర్ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్, రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో మౌలిక వసతుల్ని పరిశీలించారు. కాగా.. కొత్త హాస్టల్ భవనం ఇతరుల వసతుల కోసం రూ.14 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని డీవైఎస్ఓ అశోక్ తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, కూరపాటి రమేశ్, జీవన్ గౌడ్, ప్రశాంత్, రాజు, దేవరకొండ ప్రభుదాస్, నరేందర్ ఉన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని బుధవారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ కొర్ర లక్ష్మి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

ప్రీ పీహెచ్‌డీ ఫీజు నోటిఫికేషన్

కేయూ క్యాంపస్: కేయూలో ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, సైన్స్, ఎడ్యుకేషన్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ టెక్నాలజీ విభాగాల పీహెచ్‌డీ పరిశోధకులు ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు ఈనెల 31 వరకు, రూ.250 అపరాధ రుసుముతో ఆగస్టు 7 వరకు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

108 సిబ్బందికి 'లైఫ్ సేవియర్ అవార్డులు'



హన్మకొండ అర్బన్: వరంగల్ జిల్లాకు చెందిన మెడికల్ టెక్నీషియన్ కర్ణాకర్, 108 పైలట్ కోటేశ్ 'లైఫ్ సేవియర్' అవార్డు అందుకున్నారు. వీరు 108 అత్యవసర అంబులెన్స్ సేవలందించడంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వీరికి బుధవారం హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి ఎంఏ ఖలీద్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్, జిల్లా మేనేజర్ రాజ్‌కుమార్, లక్ష్మణ్, చంద్రశేఖర్, నరేశ్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 13 మంది ఏఎస్సైలు, 40 మంది హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను కౌన్సెలింగ్ పద్ధతిలో వారు ఎంపిక చేసుకున్న పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ.. సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమతుల్లేకుండా ఇసుక, మొరం తరలింపు

- రోడ్డు, వంతెనల నిర్మాణాల పేరిట అడ్డదారులు.
- రూ.కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి.. నిబంధనలకు విరుద్ధంగా పనులు
- సామాన్యులైతే ఎడాపెడా కేసులు.. కాంట్రాక్టర్లు అయితే అంతా 'మామూలు'
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, మైనింగ్, పోలీసు, రెవెన్యూ శాఖలు

కాంట్రాక్టర్ల ఇసుకదందా..

రోడ్డు కోసం వాగులో మొరం, మట్టి తోడడంతో ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

టెండర్లు పొంది పనులు చేపట్టాల్సిన బడా కాంట్రాక్టర్లు ఇసుక వ్యాపారుల అవతారం ఎత్తుతున్నారు. కిలోమీటర్ల కొద్ది దూరం నుంచి ఇసుక, మొరం తరలించే విధంగా వెసులుబాటు ఉన్నా.. సమీప వాగులు, చెరువులనుంచి తవ్వి రోడ్లు వేస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్ వల్ల కోట్లాది రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నా.. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసులు, మైనింగ్‌శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇసుక, మొరం తరలించడంపై ఫిర్యాదులు, నిరసనలు వ్యక్తం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో కలెక్టర్ వరకు వెళ్లాయి. వాగులనుంచి ఇసుక తీయవద్దని కచ్చితమైన ఆదేశాలున్నా.. యథేచ్ఛగా జేసీబీలు, పొక్లయినర్లతో తవ్వి టిప్పర్ల ద్వారా తరలించి మద్రిపల్లిగూడెం, చర్లపల్లి శివార్లలో సుమారు రూ.కోటి విలువ చేసే ఇసుక, మొరం నిల్వ చేసి అక్కడి నుంచి హనుమకొండ, కంఠాత్మకూర్‌లో జరుగుతున్న వంతెనల నిర్మాణ పనులకు తరలించారు. రైతులు అవసరాల కోసం ట్రాక్టర్లలో తరలిస్తే కేసులు పెడుతున్న అధికారులు.. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వి టిప్పర్లు, లారీల ద్వారా తరలిస్తుంటే 'మామూలు'గా తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

వివాదంగా చర్లపల్లి – మద్రిపల్లిగూడెం రోడ్డు, వంతెనలు

ఎంతోకాలంగా నడికూడ, కమలాపూర్ మండలాల ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్డు, వంతెనల నిర్మాణం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ఆలస్యమవుతోంది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) కింద నడికూడ మండలం చర్లపల్లి నుంచి కమలాపూర్ మండలం మద్రిపల్లిగూడెం మధ్యన



అక్రమంగా నిల్వచేసిన మట్టి, ఇసుక దంపులు



వంతెన నిర్మాణం చేయాల్సిన వాగు ప్రాంతం

రోడ్డు, పెద్దవాగు, చిన్నవాగుపై రెండు వంతెనల నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు 2023 సెప్టెంబర్ 29న శంకుస్థాపన చేశారు. మద్రిపల్లిగూడెం సమీపంలో వంతెన పనులు ప్రారంభించినప్పటికీ చర్లపల్లి శివారులోని వంతెనకు మోక్షం లేదు. కాగా చర్లపల్లి నుంచి మద్రిపల్లిగూడెం వరకు వేసే రోడ్డు కోసం మొరం తరలించడానికి అగ్రిమెంట్‌లో రూ.లక్షల ఖర్చు చేసే వీలుగా లీడ్ ఇచ్చారు. సుమారు 15 – 20 కిలోమీటర్ల నుంచి ఇసుక, మొరం తీసుకొచ్చినా ఐటీడీఏ ఆ మేరకు బిల్లులు చెల్లిస్తోంది. అయినప్పటికీ రోడుకిరువైపుల నుంచి జేసీబీ, పొక్లయినర్లతో మొరం, మట్టి తీసి రోడ్డు వేశారు. ఇదే మట్టిని హనుమకొండలోని ఓ వంతెనకు, కంఠాత్మకూర్ వంతెన పనులకు తరలిస్తుండడం గమనార్హం. మట్టి తవ్వకాలతో రోడ్డుకిరువైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి.

ఇసుక, మొరం దందా

ఇసుక, మొరం తరలింపుపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అక్రమ మైనింగ్ ఆగడం లేదు. రోడ్డు, వంతెన పనుల పేరిట మట్టిని, ఇసుకను అమ్ముకుంటూ లక్షలాది రుపాయలు ఆర్జిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతిరోజూ పదులకొద్ది ట్రాక్టర్లు, జేసీబీలతో మొరం మట్టి, ఇసుకను తరలిస్తున్నా అధికారులు ప్రేక్షకపాత్ర పోషించడంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా గ్రామ శివారులోని పొలాల మట్టిని, వాగులోని ఇసుకను తరలించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రైతులకు తిరిగి రుణాలివ్వండి

- కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: మొదటి విడత రుణమాఫీ పొందిన రైతులకు ఈనెలాఖరులోగా రెన్యువల్ చేసి తిరిగి రుణాలివ్వాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లతో రుణమాఫీపై బ్యాంకుల వారీగా నిధుల విడుదల, పంట రుణాల రెన్యువల్‌పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సమాచారమిచ్చి బ్యాంకుల దగ్గరకు వెళ్లి రెన్యువల్ చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్, సహాయ సంచాలకుడు దామోదర్‌రెడ్డి, ఎల్‌డీఎం శ్రీనివాస్, వివిధ బ్యాంకుల అధికారులున్నారు.

మత్తు నివారణపై అవగాహన కల్పించాలి

మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించడానికి విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గంజాయి, నార్కోటిక్స్ నిర్మూలనపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నార్కోటిక్స్ నియంత్రణపై తయారు చేసిన 'ప్రహరీ క్లబ్' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీడబ్ల్యూఓ మధురిమ, పరకాల ఆర్డీఓ నారాయణ, ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

పకడ్బందీగా రికార్డులు నిర్వహించాలి..

కలెక్టరేట్‌లోని ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆమె పరిశీలించారు. రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

'ప్రజా పాలన' తప్పుల సవరణకు హెల్ప్ డెస్క్

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాల కోసం ఇదివరకు చేసుకున్న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేసి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులతో మాట్లాడారు. తప్పుల సవరణ కోసం వచ్చే వారి దరఖాస్తులు పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు గ్యాస్ పాస్‌బుక్, రేషన్ కార్డు తీసుకొచ్చి సరి చేసుకోవచ్చని, గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తీసుకొచ్చి దరఖాస్తులు సరి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్కూల్‌కు అన్ని విధాలా సహకరిస్తా

డీఈఓ వాసంతి

ఐనవోలు: ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దడానికి అన్ని రకాలుగా సహకరిస్తానని డీఈఓ వాసంతి అన్నారు. బుధవారం ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల నమోదు.. ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాలు అందరికీ అందాయా? మధ్యాహ్న భోజన మెనూ, ఎఫ్ఎల్ఎస్ ఉన్నతి, లక్ష్య ప్రోగ్రాంల ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు ఎంత మేర వృద్ధి చెందాయి అని హెచ్‌ఎంను అడుగుతూనే విద్యార్థులను పరీక్షించారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడుతున్న తీరు, విద్యను అభ్యసిస్తున్న తీరును ప్రశంసించారు. సమాజ భాగస్వామ్యంతో నడుస్తూ గుర్తింపు తెచ్చుకున్న ఈపాఠశాలను మరింత అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు కష్టపడి పని చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రతాప రత్నకుమార్ పాఠశాలలోని పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. 1 నుంచి పదో తరగతి వరకు కొనసాగుతున్న పాఠశాలకు టెక్నికల్ సమస్యల వల్ల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

మంజూరు కాలేదని.. కేవలం ఎస్జీటీలు మాత్రమే ఉన్నట్లు చెప్పారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు వారి ఖర్చులతో ప్రభుత్వ టీచర్లకు తోడుగా 12 మంది ప్రైవేట్ టీచర్లను నియమించుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ మూడు హైస్కూల్ తరగతులకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. పాఠశాలకు కనీసం ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్జీటీలు అవసరం ఉందని విన్నవించారు. పాఠశాలకు కావాల్సిన ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపిస్తానని డీఈఓ హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇళ్ల కోసం ఎదురుచూపు!

'గృహలక్ష్మి' కోసం అప్పులు చేసిన పేదలు

- వడ్డీలు కట్టలేక ఇబ్బందులు
- ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు

హన్మకొండ (పరకాల): ఇంటి నిర్మాణం పేదలకు కలగానే మారిపోయింది. గత ప్రభుత్వం.. డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం మూడు సార్లు దరఖాస్తులు తీసుకుంది. చివరికి గృహలక్ష్మి మంజూరు చేస్తే కొత్త ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసింది. దీంతో ఇప్పటికే ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు గృహలక్ష్మి రద్దు పుణ్యామా.. అంటూ అప్పుల పాలై వడ్డీలు కట్టలేక మహిళలపై ఉన్న బంగారం, పుస్తెలు తాకట్టు పెడుతున్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని అమల్లోకి తీసుకురావడంతో చాలా మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,600 ఇళ్లను మంజూరు చేసింది. కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్స్ మంజూరవడంతో చాలా మంది ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.3 లక్షలు నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయనున్నట్లు ప్రొసీడింగ్స్‌లో పేర్కొనడంతో చాలా మంది ఇళ్ల నిర్మాణ పనుల్ని అప్పులు చేసి మొదలు పెట్టారు. వీటిలో మొదటి దశలో ఉన్న 3,400 ఇళ్లలో 1,200 ఇళ్లకు ఇంజనీరింగ్ అధికారులు జియోట్యాగింగ్ పూర్తి చేశారు. ఎన్నికల తర్వాత కూడా జిల్లా నోడల్ అధికారులు సైతం వాటిని పరిశీలించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇల్లు కూడా ఉండడంతో గృహలక్ష్మి లబ్ధిదారులు గతంలో ఇల్లు మంజూరైన తమకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రజాపాలన ద్వారా అధికారులకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది.

అప్పుల పాలు..

గృహలక్ష్మి ఇళ్లు మంజూరైన వారు ఇంటి నిర్మాణానికి రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు అప్పు చేశారు. ఇళ్లు మంజూరైన వారిలో కొంత మందికి చేతిలో చిల్లిగవ్వ లేక పుస్తెలు, బంగారం కుదువబెట్టారు. మరికొందరు.. రూ.3 నుంచి రూ.5 వడ్డీకి లక్షల రుపాయలు అప్పు చేసి పనులు మొదలు పెట్టారు. బిల్లు రాగానే తిరిగి చెల్లిస్తామని అప్పుపత్రం రాసుకున్నారు. ప్రస్తుతం వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

గుడిసెల్లో జీవనం..

ఖాళీ స్థలం ఉన్న వారికే గృహలక్ష్మి ఇళ్లు మంజూరు చేస్తామని అధికారులు స్పష్టం చేయడంతో చాలా మంది ఉన్న ఇళ్లను కూల్చుకొని ఇళ్ల కట్టుకోవడం మొదలుపెట్టారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు చిన్నపాటి గుడిసెలు వేసుకుని కాలం గడుపుతున్నారు.



పరకాల ఎస్సీ కాలనీలో బేస్మెంట్ లెవల్‌లో ఉన్న గృహలక్ష్మి ఇళ్లు

నగలు కుదువ పెట్టినం..



గతంలో డబుల్ బెడ్ రూం ఇల్లుకు దరఖాస్తు పెట్టుకుంటే రాలేదు. మళ్లీ గృహలక్ష్మి దరఖాస్తు చేసుకుంటే అధికారులు వచ్చి చూసుకొని మాకు గృహలక్ష్మి ఇల్లు వచ్చినట్లు కలెక్టర్ ప్రొసీడింగ్ ఇచ్చారు. దీంతో మేం ఉన్న ఇల్లు కూల్చుకొని బంగారం కుదువపెట్టి, మరో రూ.2లక్షల అప్పు చేసి ఇంటి పనులు మొదలు పెట్టినం. బిల్లు కోసం ఎదురు చూస్తుంటే కొత్త ప్రభుత్వం గృహలక్ష్మి రద్దు చేసింది. అప్పు ఎలా తీరుతుందోనని భయమేస్తోంది. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాం. గృహలక్ష్మికి బదులు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి.

- కాశీమల్ల జయ, దుబాసివాడ, పరకాల

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి..



పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో 37 మంది నిరుపేద కుటుంబాలకు గృహలక్ష్మి ద్వారా ఇళ్లు మంజూరయ్యాయి. ఇల్లు వచ్చిందంటే చాలా మంది రూ.2 నుంచి రూ.4 లక్షలు అప్పు చేసి పనులు మొదలుపెట్టారు. కానీ.. కొత్త ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని గృహలక్ష్మి రద్దు చేయడం విచారకరం. గృహలక్ష్మి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతున్నాం.

- శనిగరపు రజని, 13వ వార్డు కౌన్సిలర్ పరకాల మున్సిపాలిటీ



బుజ్జి సందడి



కల్కి సినిమాలో హీరో ప్రభాస్ ఉపయోగించిన 'బుజ్జి' కారు వరంగల్ నగరంలో సందడి చేసింది. ఇటీవల విడుదలైన కల్కి సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ నిమిత్తం హనుమకొండలోని ఏషియన్ మాల్‌లో 'బుజ్జి'కారును బుధవారం ప్రదర్శనకు ఉంచారు. దీనిని చూసేందుకు యువత పెద్ద ఎత్తున తరలివచ్చింది. బుజ్జితో సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసుకుని సంబురపడ్డారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

నగరంలో 5 మహిళా క్యాంటీన్లు

వరంగల్ అర్బన్: నగరంలో 5 ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో ఆమె అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఇందిరమ్మ క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయం, కాశిబుగ్గ, కాజీ పేట సర్కిల్ కార్యాలయాలతో పరిధిలో తొలి దశలో 30 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సభ్యులకు సీఓలు అవగాహన కలిగించి వారి ద్వారా యూనిట్ల ఏర్పాటుకు చొరవ చూపించాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వివిధ రకాల ఉపాధి అందించడానికి వివిధ ఉత్పత్తుల తయారీలో శిక్షణ అందించడానికి శాశ్వతంగా కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎంజీఎం: వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు నిల్వ ఉండడం, పరిసరాల పరిశుభ్రత లోపించడం, తాగు నీరు కలుషితం వల్ల వివిధ రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ సాంబశివరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కీటక జనిత వ్యాధులు, అంటువ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలోనూ ప్రజలు సహరించాలని కోరారు. దోమల ఉత్పత్తిని తగ్గించడానికి, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. కలుషిత నీటి నివారణ కోసం క్లోరినేషన్ చేసిన లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అపరిశుభ్ర ఆహారాన్ని తీసుకోవద్దని, ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే వెంటనే సంబంధిత ఆస్పత్రిని, వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.



క్లుప్తంగా

నవలలకు ఆహ్వానం

హన్మకొండ కల్చరల్ : ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం -2024 సంవత్సరానికిగాను నవలలను ఆహ్వానిస్తున్నామని అభ్యుదయ రచయిత సంఘం అధ్యక్షులు నిధి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పల్లేరు వీరస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ నవలను ఎంపిక చేసి అక్టోబర్‌లో హనుమకొండలో నిర్వహించే కార్యక్రమంలో రూ.5వేల నగదు, శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. 2020 జూలై నుంచి 2024 జూన్ వరకు ప్రచురితమైన మొదటి ముద్రణలు మాత్రమే పంపాలని, అన్ని ప్రాంతాల వారు పంపొచ్చని, వచ్చే నెల 31వ తేదీ లోగా ప్రతులు పంపాలన్నారు. ఇతర వివరాలకు 9701000306 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఆదిత్య బార్‌పై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడి

- బూజు పట్టిన కీరదోస, వాసన పట్టిన చికెన్, తలకాయ పాయ గుర్తింపు



బూజుపట్టిన కీరదోసను చూపిస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి , వాసన పట్టిన మటన్ తలకాయ పాయ, చికెన్ కూర

ఖిలా వరంగల్: వరంగల్ నక్కపెల్లి గ్రామ పరిధిలోని ఆదిత్య బార్‌షాపుపై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేశారు. బార్‌లో అపరిశుభ్రంగా ఉన్న వంట గదిని పరిశీలించారు. వంట గది అంతా అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వస్తుండడం, బూజుపట్టిన కీరదోస, కుళ్లిపోయి వాసన పట్టిన చికెన్ కర్రీ, మటన్, తలకాయ పాయను గుర్తించి సీజ్‌చేశారు. అనంతరం వివరాలు సేకరించి బార్ యజమానికి నోటీసులు జారీ చేశారు. సీజ్ చేసిన వంటలను ల్యాబ్ పంపించామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. బార్ యజమానిపై చట్ట ప్రకారం చర్యల నిమిత్తం నోటీలు జారీ చేశామన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఎంజీఎం: కాకతీయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అదనపు కలెక్టర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిపాలన పర్యవేక్షణ అధికారి ఎ.వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎంజీఎం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళితో కలిసి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శించారు. ఈసందర్భంగా రోగులకు మరిన్ని మెరుగైన సేవలందించడానికి అవసరమైన చర్యలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆశలు.. అడియాసలేనా!

- విద్యుత్ సంస్థల్లో ఇంకా జరగని బదిలీలు
- షెడ్యూల్ విడుదల కోసం ఉద్యోగుల ఎదురుచూపు
- స్పష్టత ఇవ్వని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- ట్రాన్స్‌కో సీఎండీ మారడం కూడా జాప్యానికి కారణమని ఉద్యోగ వర్గాల్లో చర్చ

హన్మకొండ: తెలంగాణ ప్రభుత్వం అవకాశమిచ్చినా రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో బదిలీలు చేపట్టలేదు. ఫలితంగా తమ ఆశలు అడియాసలు అవుతున్నాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అసలు బదిలీలు జరుగుతాయా? లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 వరకు ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించింది. అయితే ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో వివిధ కారణాలతో బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. విద్యుత్ సంస్థల్లోనూ చేపట్టకపోవడంతో ఆ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే బదిలీలకు ఈ నెల 31 వరకు గడువు ఇచ్చినట్లు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ సంస్థల పాలక మండళ్లను మార్చిన ప్రభుత్వం..

రాష్ట్రంలో జెన్‌కో, ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ సంస్థలున్నాయి. ఈ విద్యుత్ సంస్థల్లో బదిలీలు, పదోన్నతులు జరిగిన



ప్రతిసారి ఆయా యాజమాన్యాలు సమిష్టి నిర్ణయం తీసుకుంటాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ సంస్థల పాలకమండళ్లను మార్చింది. ఐఏఎస్ అధికారులను సీఎండీలుగా నియమించింది. ట్రాన్స్‌కో సీఎండీగా ఉన్న సయ్యద్ ఆలీ ముర్తజా రిజ్వీని బదిలీ చేసి రోనాల్డ్ రోస్‌ను ట్రాన్స్‌కో సీఎండీగా నియమించింది. ఈ క్రమంలో బాధ్యతలు చేపట్టిన రోనాల్డ్ రోస్ బదిలీలపై ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది. ట్రాన్స్‌కో సీఎండీ మారడం కూడా బదిలీలపై నిర్ణయం తీసుకోవడానికి జరుగుతున్న జాప్యానికి కారణం కావొచ్చని విద్యుత్ ఉద్యోగుల వర్గాలు చర్చించుకుంటున్నాయి.

బదిలీలపై ఎలాంటి సంకేతాలు లేవు..

బదిలీలపై ఎలాంటి సంకేతాలు వెలువడకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. గతంలో బదిలీలు జరిగినప్పుడు కోల్పోయిన అవకాశాలు ఈ సారైనా దక్కకపోతాయా అని భావిస్తున్న ఉద్యోగుల ఆశలు అడియాసలుగానే మిగిలిపోతున్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాలు, పట్టణాలకు దూరంగా పని చేస్తున్న ఉద్యోగులు జిల్లా కేంద్రాలు, నగరాలు, పట్టణాలకు రావాలని ఆశిస్తున్నారు. జూలై చివరి వారం వచ్చినా షెడ్యూల్ విడుదల కాకపోవడంతో బదిలీలు జరుగుతాయా లేదా అని, యాజమాన్యం నుంచి స్పష్టత లేకపోవడంతో తాము పాత స్థానాల్లోనే కొనసాగాల్సి వస్తుందేమోనని నిట్టూరుస్తున్నారు.

వేయికండ్లతో ఎదురుచూపులు

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలలు జరిగితే తమకు అనుకూల స్థలాలకు వెళ్లొచ్చని ఆశిస్తున్న ఉద్యోగుల ఆశలు నిరాశలవుతున్నాయి. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో దాదాపు 9, 880 మంది ఉద్యోగులున్నారు. హనుమకొండ జిల్లాలో 780, వరంగల్‌లో 440, జనగామలో 425, భూపాలపల్లి, ములుగు జిల్లాలో 405, మహబూబాబాద్‌లో 400, కరీంనగర్‌లో 1,062, జగిత్యాలలో 712, పెద్దపల్లిలో 602, ఖమ్మంలో 771, భద్రాద్రి కొత్తగూడెంలో 514, నిజామాబాద్‌లో 1,304, కామారెడ్డిలో 774, ఆదిలాబాద్‌లో 324, కొమురంభీం ఆసిఫాబాద్‌లో 209, మంచిర్యాలలో 445, నిర్మల్‌లో 437, ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 203, డీపీఈలో 70, సీపీలో 57 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో 4 సంవత్సరాలు పైబడి ఒకే చోట పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు బది లీల కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.

ఇండోర్ స్టేడియం మరమ్మతులను పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: బల్దియా ఇండోర్ స్టేడియంలో మరమ్మతు పనుల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బల్దియా ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి అందులో చేపట్టాల్సిన మరమ్మతు పనుల్ని పరిశీలించారు. వేగంగా పూర్తి చేసేందుకు అధికారులకు సూచనలిచ్చారు. ఈసందర్భంగా స్టేడియం పైకప్పు నుంచి వర్షపు నీరు పడుతోందని, ఫ్లోరింగ్ దెబ్బతిన్నదని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. టేబుల్ టెన్నిస్ కోర్టును పరిశీలించి అందుకు సంబంధించిన సామగ్రిని ఏర్పాటు చేసి శిక్షణ క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆగస్టు 15 సందర్భంగా బల్దియా తరఫున అధికారులు సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ నిర్వహించి వివిధ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించేలా చూడాలని సూచనాలిచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ శంకర్ లింగం, ఈఈ రాజయ్య, డీఈ రవికుమార్, ఏఈ రాగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు జియో ట్యాగింగ్ చేయండి

'సగం దాటని లక్ష్యం' శీర్షికన ఈనెల 17న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రతీ మొక్కకు లెక్కలు కావాలని, ఆ దిశగా నాటుతూ, జియో ట్యాగింగ్ చేసి సంరక్షించేలా



స్టేడియాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

చూడాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఉద్యానవన అధికారులతో ఆమె సమీక్ష ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బల్దియా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అవెన్యూ ప్లాంటేషన్ పనులు కొనసాగుతున్నాయని.. వర్షాకాలం నేపథ్యంలో ఆ పనుల్ని వేగంగా పూర్తి చేసి మొక్కలు నాటాలన్నారు. పార్కులు పరిశుభ్రంగా ఉండేలా సహాయ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు జరపాలని మొక్కలు నాటడానికి వీలుగా ట్రాక్టర్ మౌంటెడ్ యంత్రాన్ని అద్దెకు తీసుకొని ఆ పనుల్లో వేగం పెంచాలని హెచ్చరించారు. సమావేశంలో హార్టికల్చర్ అధికారి రమేశ్ సహాయ అధికారులు ప్రిన్సి, అశ్విని, ప్రియాంక, అనూహ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కమిషనర్ పేరిట ఫైళ్లు

వరంగల్ అర్బన్: బల్దియా కమిషనర్ పేరిట ఫైళ్లు కొనసాగుతున్నాయి. తాజాగా ముగ్గురు ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు డ్రైవర్లుగా పదోన్నతులు కల్పిస్తూ.. ప్రజారోగ్య విభాగం నుంచి ఫైల్ అకౌంట్స్ సెక్షన్‌కు అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేతనాలు కూడా రూ.20,500లకు పెంచాలని ఫైళ్లు పంపించడంపై పీహెచ్ వర్కర్లు తప్పుడుతున్నారు. ప్రస్తుత కమిషనర్ సంతకం లేకుండా బదిలీ కమిషనర్ పేరిట ఉన్న సంతకాలతో ఫైళ్లను అమలు చేస్తుండడంపై పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బల్దియా ఇంజనీర్లకు బదిలీలు

వరంగల్ అర్బన్: సుదీర్ఘకాలంగా వరంగల్ బల్దియాలో పాతుకుపోయిన ముగ్గురు డీఈలు ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఈమేరకు మంగళవారం రాత్రి పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేసింది. బల్దియా డీఈలు సంజయ్‌కుమార్ గ్రేటర్ హైదరాబాద్‌కు, టి.రవికుమార్ పబ్లిక్ హెల్త్ వరంగల్ డివిజన్-2, ఇషాంత్‌జహాన్‌కు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో శ్యాం మోహన్, కె.ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్ రానున్నారు. త్వరలో మరికొన్ని బదిలీలు జరగనున్నట్లు సమాచారం.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ములుగు రూరల్: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కన్నాయిగూడెంలో చోటు చేసుకుంది. రెండో ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యాట సాంబయ్య (60) అదే గ్రామానికి చెందిన యాట రమేశ్, పల్లె వేణుతో కలిసి లక్నవరంలో చేపల వేటకు వెళ్లాడు. తెప్ప సాయంతో చెరువులోకి వెళ్లిన సాంబయ్య.. వలలు లాగుతుండగా కాలికి చిక్కుకుని చెరువులో మునిగి మృతి చెందాడు. కొంత సమయం తరువాత సాంబయ్య కనిపించకపోవడంతో రమేశ్, వేణు.. సాంబయ్య కోసం వెతికారు. నీటిలో మునిగిన సాంబయ్య అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చదువుకోమని తండ్రి మందలించాడని..

- బాలిక ఆత్మహత్య
- గూనిపర్తిలో ఘటన

కమలాపూర్: చదువుకోమని తండ్రి మందలించాడనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక.. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తిలో చోటు చేసుకుంది. సీఐ హరికృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర హారిక (17) పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటర్మీడియట్ చదవడం ఇష్టంలేదని తండ్రికి చెప్పింది. దీంతో ఇంటి దగ్గర ఉండి ఏం చేస్తావు.. చదువుకోమని మందలించాడు. దీనికి మనస్తాపానికి గురైన హారిక మంగళవారం సాయంత్రం పురుగుల మందు సేవించింది. ఈ విషయం అదే రోజు రాత్రి తండ్రికి తెలపగా వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించారు. వైద్యులు పరీక్షించి హారిక అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు

- పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు విద్యాధర్
- రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న విద్యాధర్

వరంగల్ స్పోర్ట్స్ : తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచొద్దని, సహనం పాటిస్తే కచ్చితంగా సత్ఫలితాలు వస్తాయని పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు జేబీఎస్ విద్యాధర్ అన్నారు. ఉమ్మడి వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్-17) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరగనున్న చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ వేడుకలకు పార్మర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు జేబీఎస్ విద్యాధర్, కిదాంబి నందగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ క్రీడాకారులు పట్టుదల, క్రమశిక్షణతోపాటు కఠోర శ్రమ చేసినప్పుడే లక్ష్య చేధిస్తారన్నారు. మరో అతిథి నందగోపాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై పీవీ సింధు, సాత్విక్‌సాయిరాజ్ సత్తాచాటుతున్నారని, వారి స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి ఎం.జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులు జరిగే పోటీలకు 140 మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి డి. నాగకిషన్, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, క్రీడా పరిశీలకుడు సుధాకర్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్. మోహన్‌రావు, అసోసియేషన్ బాధ్యులు, టెక్నికల్ అఫీషియల్స్ కొమ్ము రాజేందర్, వైకుంఠం, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, విశ్వప్రకాశ్, రాజేశ్, పీసీఎస్ రావు, కిశోర్, పీవీఎల్ కుమార్, శ్యాంకుమార్, భాస్కర్, శైలజ, హరికృష్ణ, శ్యాంప్రసాద్, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అవగాహన ఉండాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ (2024-2025) పై ఆ కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ చర్చలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్నిరంగాలను అభివృద్ధి పరిచే విధంగా బడ్జెట్ రూపకల్పన ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఎక్కువ కేటాయించాలన్నారు. కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్రరాజు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. చర్చ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పూర్తిగా నిరాశ పరిచిందన్నారు. పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ తిరుణహరిశేషు మాట్లాడుతూ కేంద్రవార్షిక బడ్జెట్‌లో ఆదాయం కంటే అప్పులే ఎక్కువగా కేటాయించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్. ఆదిరెడ్డి, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వివక్షలకు వ్యతిరేకంగా పోరాడడమే నాస్తికత్వం

- ద్రవిడ కళగం నేత కుమరేసన్



మాట్లాడుతున్న ద్రవిడ కళగం నాయకుడు కుమరేసన్

హన్మకొండ: వివక్షలకు వ్యతిరేకంగా పోరాడడమే నాస్తికత్వమని ద్రవిడ కళగం నాయకుడు కుమరేసన్ అన్నారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లిలోని పీఆర్ రెడ్డి భవన్‌లో భారత నాస్తిక సమాజం జాతీయ కమిటీ సభ్యులు జె.రవి, ఉప్పులేటి నరేశ్ అధ్యక్షతన భారత నాస్తిక సమాజం తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభ జరిగింది. ఈ సభలో కుమరేసన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారత దేశంలో సామాజిక విప్లవాలు, రాజ్యాంగ సవరణలకు కారణమైన పెరియార్ ఉద్యమ భావజాలాన్ని 1970 నుంచి ప్రచారం చేసి ప్రజలను చైతన్యం చేయడంలో నాస్తిక సమాజం వ్యవస్థాపకుడు జయగోపాల్ తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. వి.సి.కె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ ఖాసీం, రచయిత గురిజాల రవీందర్, భారత నాస్తిక సమాజం జాతీయ కమిటీ సభ్యులు సాయిని నరేందర్, జె. రవి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి దేశంలో మనుధర్మ పాలన తీసుకొచ్చే ప్రమాదముందన్నారు. ప్రగతిశీల శక్తులు, నాస్తికులు, హేతువాదులు మానవీయ విలువల సమాజ నిర్మాణం కోసం ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. సభలో వి.సి.కె పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మచ్చ దేవేందర్, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, భారత నాస్తిక సమాజం నాయకులు జ్యోతికుమార్, చార్వాక, శ్యామల, రామంచ భరత్, గుమ్మడిరాజుల సాంబయ్య, పెండ్యాల సుమన్, వేదాంత మౌర్య, సంతోశ్, స్వప్న, అశోక్, గుత్తికొండ చక్రధర్, రాధండి దేవేందర్, పల్లె ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రమాదరహిత సంస్థగా నిలపాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీటీసీ శ్రీనివాస్

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీని ప్రమాదరహిత సంస్థగా నిలపాలని హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ-1 డిపోలో వరంగల్ రీజియన్ ప్రమాదరహిత వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. డీటీసీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. సరైన విశ్రాంతి తర్వాతే డ్యూటీకి హాజరు కావాలన్నారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి చిరునామా ఆర్టీసీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సేఫ్టీ అవార్డులు ప్రతి సంవత్సరం అందుకుంటుందన్నారు. డ్రైవర్లలో క్రమశిక్షణ, అప్రమత్తత పెంచడానికి ప్రతి సంవత్సరం జనవరిలో రోడ్డు భద్రత పక్షోత్సవాలు, జూలైలో ప్రమాదరహిత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు మీద వెళ్లే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వాహనాలు నడపాలన్నారు. ప్రయాణికుల జీవితం బస్సు డ్రైవర్ చేతిలో ఉందని, తన బాధ్యతను గుర్తెరిగి బస్సు నడపాలన్నారు. కార్యక్రమంలో వరంగల్-1 డిపో మేనేజర్ వంగాల మోహన్ రావు, సూపర్ వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో సంకటచతుర్థి పూజలు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో ఆషాఢ బహుళ చతుర్థి తిథిని పురస్కరించుకుని బుధవారం సంకటహరచతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠ, అర్చకులు ప్రణవ్ మూలమహాగణపతికి గణపతిసూక్త మూలమంత్రములతో హరిద్రాకుంకుమ, గంధోదకాలతో అభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు నీరాజనమంత్రపుష్పం, నైవేద్యం సమర్పించి మహాహారతి నిర్వహించారు.



మూలగణపతికి హరిద్రాకుంకుమలతో అభిషేకం చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

'శతాధిక' వృద్ధురాలి మృతి



ఈరవ్వ(ఫైల్)

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన 'శతాధిక' వృద్ధురాలు బరిగెల ఈరవ్వ(118) మృతి చెందింది. బుధవారం ఉదయం స్నానం చేసి పాలు తాగుతూ అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా మృతి చెందింది. కాగా, ఈరమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తెతో పాటు మనువలు, మనువరాళ్లు దాదాపు 30 మందికి పైగా ఉన్నారు.

ఆస్పత్రి గడప తొక్కని ఈరమ్మ..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పాతికేళ్లు దాటితే చక్కెర వ్యాధి, రక్తపోటు అంటూ ఆస్పత్రుల చుట్టుతిరుగుతూ జీవనం గడుపుతున్న తరుణంలో శతాధిక వృద్ధురాలు ఈరమ్మ సూదిమందు కూడా లేకుండా జీవించింది. మంగళవారం వరకు తనపని తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉంది. కాగా, 118 ఏళ్లలో ఏనాడు ఆస్పత్రి గడప తొక్కలేదని, కనీసం సూదిమందు అంటే కూడా తెలియదని కుటుంబీకులు తెలిపారు.

కాంగ్రెసోళ్లవి తుపాకీరాముని మాటలు

- పథకాల పేరిట ప్రజల చెవుల్లో పూలు పెట్టారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా కుట్టు మిషన్ల పంపిణీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడుగుతుంటే .. కాంగ్రెస్ నాయకులు తుపాకీ రాముని మాటలు మాట్లాడుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం జనగామ మండలం యశ్వంతాపూర్ సత్యసాయి కన్వెన్షన్‌లో పోచంపల్లి ఫౌండేషన్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగాలఘణపురం మండలంలోని వెయ్యి మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం నాడు ఎన్టీఆర్, నేడు కేసీఆర్ కృషి చేశారన్నారు. గృహలక్ష్మి, రైతుబంధు, రుణమాఫీ, కల్యాణలక్ష్మిలో అదనంగా తులం బంగారం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజల చెవుల్లో పూలు పెట్టారన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే కేటీఆర్ బర్త్‌డే రోజు కుట్టు మిషన్లు అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతోనే తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో పది వేల మందికి శిక్షణ ఇప్పించానన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ జయశ్రీ, భాగ్యలక్ష్మి, తిర్మల్‌రెడ్డి, శరత్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి,రాజు పాల్గొన్నారు.

మోడల్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంగా ఎల్కతుర్తి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎల్కతుర్తి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీజీఎంలు, జీఎంల సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొడవాటి లైన్లలో సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని పరిష్కరించడానికి ఆ లైన్ మొత్తం పెట్రోలింగ్ చేసుకుంటూ వెళ్లడం వల్ల ఆలస్యం అవుతోందన్నారు. అయితే ఈ సమస్యను అధిగమించడానికి ఫాల్ట్ ప్యాసేజీ ఇండికేటర్లు అమర్చుతున్నట్లు తెలిపారు. వీటి ద్వారా సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించొచ్చన్నారు. ములుగు, నర్సంపేటలో ప్రతి 4 కిలో మీటర్లకు ఫాల్ట్‌ప్యాసేజీ ఇండికేటర్ అమర్చుతున్నామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకొస్తున్నామని, ఈ టెక్నాలజీతో సబ్‌స్టేషన్లలో లోడ్, పవర్ ఫాక్టర్, ట్రిప్పింగ్స్, బ్రేక్‌డౌన్లు, ఎల్‌సీ తదితర పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. సమస్యను సులభంగా గుర్తించి అదే వేగంతో పరిష్కరించొచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు గౌతమ్ రెడ్డి, నాగప్రసాద్, శ్రీనివాస్, డీఈ (ఐటీ) అనిల్‌కుమార్ పాల్గొన్నారు.